

వీధి కుక్కల తరలింపునకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

జనావాసాల మధ్య తిరుగుతూ ప్రమాదకరంగా మారిన వీధి కుక్కల తరలింపునకు నగరపాలక సంస్థ ప్రజారోగ్యశాఖా విభాగం శాఖాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మేయర్ స్రవంతి జయవర్ధన్ ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ ఛాంబర్‌లో నగరపాలక సంస్థ ప్రజారోగ్యశాఖాధికారి డా.వెంకటరమణ, ఇతర అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో వీధికుక్కల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేయర్ పి స్రవంతి

రైతన్నకు మళ్లీ వర్షం గుబులు..!

మరో మూడు రోజులు వర్ష సూచన - పరిహారం అందని వైనం

రైతులకు అకాల వర్షం వణికుపుట్టిస్తోంది. గత కొంత కాలంగా అకాలంగా వర్షం రైతులకు గుబులు పుట్టిస్తోంది.గత నెల 28 కురిసిన వర్షాలకు భారీగా నష్టం జరిరింది. వరి, పొగాకు, అరటికి నష్టం జరిగింది. కల్లాల్లో ధాన్యం తడిచిపోయింది. ప్రభుత్వం నష్టం అంచనాలు తయారుచేసినా పరిహారం ఇంకా అందలేదు. ఇన్‌పుడ్ సబ్సిడీ ఇస్తామని ప్రకటించింది. వరికోతలు దాదాపు 80 శాతం పూర్తి చేశారు. కొందరు నెల్లూరు మసూరికి గిట్టిబాటు ధర రాకపోవడంతో ఇళ్లు, పొలాల్లో ధాన్యం పెట్టుకున్నారు.మళ్లీ మూడు రోజులు అకాల వర్షం వస్తుందని తెలియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులు వీస్తే మామిడి, అరటికి తీవ్రంగా నష్టం జరిగే అవకాశాలున్నాయి.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రస్తుతం అకాల వర్షాలు రైతులను భయపెడుతున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు ఆకాశం మేఘావృతం అవ్వడం క్షణాల్లో గాలీ,వానలు బీభత్సం చేస్తున్నాయి. గత నెలలో రెండు సార్లు అకాల వర్షాలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. వరి కోతకు రావడంతో పెద్ద ఎత్తున పంట నీట మునిగింది. అధికారులు ప్రాథమిక అంచనాలు తయారు చేశారు.ప్రభుత్వానికి తరువాత నివేదిక సమర్పించారు. ఇదే సయమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ రైతుల వద్దకు వెళ్లి పరామర్శించిన పరిస్థితులు కనిపించలేదు. ప్రతిసారిలాగే ఇన్‌పుడ్ సబ్సిడీ ఇస్తామని ప్రకటించింది. ఈ ఏడాది వరికి మంచి గిరాకీ వచ్చింది. తెలంగాణ మసూరికి గతంలో ఎన్నడూ లేని విధంగా ధర వచ్చింది. సుమారు పుట్టి రూ.20 వేల వరకు పలికింది. ఇదే సమయంలో అకాల వర్షాలు కారణంగా ధాన్యం తడిచిపోయింది. ధాన్యం రంగుమారడంతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ ఏడాది భారీగా దిగుబడి వచ్చినా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం, కొనడంలో నిర్లక్ష్యం కనిపించింది. ఎక్కడా ఒక్క కేంద్రం కూడా తెరిచిన పరిస్థితులు కనిపించలేదు. నెల్లూరు మసూరికి పుట్టి కేవలం రూ.13,500 నుంచి రూ.14 వేల వరకు మాత్రమే ధర ఉండడంతో అనేక ప్రాంతాల్లో రైతులు ధాన్యం నిల్వచేసుకున్నారు. విడవలూరు, సంగం, బుచ్చి, కోవూరు, కొడవలూరుతోపాటు అనేక కేంద్రాల్లో ఇంకా కొంత వరి కోతలు ఉన్నాయి. కొందరు ఇళ్లలోనూ, పొలాల్లో రాశులు పోసుకున్నారు. మంచి ధర వస్తే చూస్తామంటూ ఉండడంతో ఇప్పుడు అకాల వర్షాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

సంగం మండలంలోని పొలాల్లో నిల్వ ఉంచిన ధాన్యం

సంగం మండలంలో ఒక రైతు వద్ద 70 పుట్లవరకు పొలాల్లోనూ ఉంచుకున్నారు. రానున్న మూడు రోజుల భారీ వర్షాలు ఉండడంతో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన కనిపిస్తోంది. గాలి, వానల బీభత్సం ఉంటుందని తెలియడంతో మామిడి, అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు, కావలి, నెల్లూరు ప్రాంతాల్లో మామిడి, టిపిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, తదితర ప్రాంతాల్లో అరటి సాగుచేస్తున్నారు. వర్షాలు ఇలానే వస్తే రైతులు భారీగా నష్టపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంది. అకాల వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. రైతులు ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన చెందుతున్నారు.

మీడియాతో మాట్లాడుతోన్న ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

8న 'కోటంరెడ్డి' మరో పోరాటం..!

-సిఎం కార్యాలయానికి పోస్ట్ కార్డులు

-పది రోజులు నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : 8 నుంచి పది రోజులపాటు మరో పోరాటం నిర్వహిస్తామని నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళ వారం తన కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం పోరాటం చేస్తామన్నారు.150 అంకణాల స్థలాన్ని కేటాయించడంతోపాటు.. భవన నిర్మాణం కోసం స్వయంగా ముఖ్యమంత్రి జగన్ ఆమోదం తెలిపారు. ఇంతవరకూ నిధులు విడుదల కాలేదని శ్రీధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 8న. ముఖ్యమంత్రి కార్యాలయానికి వాట్సాప్.. పోస్ట్ కార్డు.. టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా విజ్ఞప్తి చేస్తామన్నారు.10 రోజులపాటు నెల్లూరు నగర..రూరల్ నియోజకవర్గ పరిధిలోని చర్చిలలో పర్యటించి క్రిస్టియన్ సోదరుల ద్వారా పోరాటాన్ని ఉధతం చేస్తామన్నారు. ఈ నెల 18న ప్రతి చర్చి నుంచి ఒక ఇటుకను తీసుకెళ్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో నిరసన తెలుపుతామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల ఆర్థిక తోడ్పాటుకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు :మేలైన సాగు పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహించి, వారి ఆర్థిక తోడ్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ హరి నారాయణన్, వ్యవ సాయ శాఖ అధికారులతో సమావేశమై జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాలు, అగ్రికల్చరల్ సీజనల్ కండిషన్స్, ఈ పంట విధానం, వై.ఎస్.ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్, స్పందన- జగనన్నకు చెబుతాం.. డాక్టర్ వై.ఎస్.ఆర్ ఉచిత పంటల భీమా పథకం, వై.ఎస్.ఆర్ సున్నా వడ్డీ పథకం అమలు, వ్యవసాయ యాంత్రీకరణ, కిసాన్ డ్రోన్స్ విని యోగం, ఖరీఫ్ సీజన్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లభ్యత తదితర అంశాలపై సమీక్షించారు. కల్లెకర్ మాట్లాడు తూ, శాస్త్రీయ పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగిబడి సాధించేలా రైతులను ప్రోత్సహించి రైతుల ఆదాయం వద్ధి చెందేలా క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు కషి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున, జిల్లాలో ఎంత విస్తీర్ణంలో వరి పంట వేస్తున్నారు, అందు కనుగుణంగా అవసరమగు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుధాకర్ రాజు, వ్యవసాయ శాఖ డిడి లు, ఎడి లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

గృహ రుణాలపై అవగాహన

నెల్లూరు :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టిడ్కో గృహాల పంపిణీకై లబ్ధిదారులు స్వయంగా గృహ రుణాలను పొందేలా అవగాహన కల్పించాలని అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ లోని కమిషనర్ కార్యాలయంలో టిడ్కో విభాగం, నగర పాలక సంస్థ అధికారులు, మెప్మా విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నవరత్నాలు పథకంలో భాగంగా పేదలకు అందిస్తున్న గహాల పట్ల ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. టిడ్కో ఈ.ఈ రంగయ్య, మెప్మా విభాగం అధికారులు, నగర పాలక సంస్థ టి. పి. ఆర్. ఓ. ప్రసాద్ , హౌసింగ్ విభాగం సిద్ధిఖ్, సందీప్ పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కమిషనర్

పోషకాహారం పంపిణీ

పొదలకూరు : కలెక్టర్, డిఎంహెచ్ఓ, జిల్లా టిబి నియంత్రణ అధికారి ఆదేశాల మేరకు ప్రధానమంత్రి టిబి ముక్తాభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహ్మదాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహారం పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. డాక్టర్ రమేష్ టిబి వ్యాధిగ్రస్తులు పోషకాహారం తీసు కోవాలన్నారు. టిబి యూనిట్ సూపర్‌వైజర్, వి శబరినాథ్ ఉన్నారు.

విజయోత్సవ సభ

కందుకూరు :సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఎంపిడిఓ పి విజయ్ శేఖర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ విజయోత్సవ సభ జరిగింది. సభలో విజయ్ శేఖర్ మాట్లాడారు. . మండల పరిషత్ అధ్యక్షురాలు ఇంటూరి సుశీల ఉద్యోగాలు పొందిన ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థిని, విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కే మస్తానయ్య మాట్లాడారు. ఉద్యోగ అవకాశాలు కల్పించిన సాంకేతిక విద్యశాఖ డైరెక్టర్ సి నాగరాణికి కతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ట్రైనింగ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య అభినందించారు.

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి..

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో కందుకూరు మండలం జిల్లెలమూడిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పార్టీ నేతలు ఇంటింటికి తిరుగుతూ గ్రామస్తులు సమస్యలను అడి తెలుసు కున్నారు. పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇస్తే, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని ఎలా నాశనం చేశాడో ప్రజలు గమనిం చాలన్నారు. చివరలో 'రచ్చబండ'లో నిర్వహిం చారు. గ్రామపార్టీ అధ్యక్షులు బెజవాడ శ్రీను, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతి నిధి గోచిపాతల మోషే, కందుకూరు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు నాదెళ్ల వెంకట సుబ్బారావు, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి బొద్దులూరి కొండలరావు ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తోటపల్లిగూడూరు : స్త్రీ శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ అధికారి హేనా సుజన్ మంగళవారం వెల్లడించారు.అర్హులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

వెంకటాచలం : ఐసిడిఎస్ వెంకటాచలం ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ వర్కర్ పోస్టులకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని కొండసముద్రం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం (0806184) నందు ఖాళీగా ఉన్న కార్యకర్త పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్త్రీ శిశుసంక్షేమ శాఖ కందుకూరు ప్రాజెక్టు అధికారిణి శశికృష్ణ ప్రకాశం మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కేటగిరికి రిజర్వు చేయబడినట్లు మండల పర్యవేక్షకురాలు సునీత వివరించారు. అర్హులు ఈ నెల 9వ తేదిలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు.

సైదాపురం మండలంలో అంగన్‌వాడీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్ట్ అధికారిణి సునంద ఒక ప్రకటనలో తెలిపారు. తలుపూరు, ఓరుపల్లి గ్రామాలలోని 2అంగన్వాడీ వర్కర్ పోస్టులకు, కొమ్మిపాడుపంచా యతిలోని 2అంగన్వాడీ హెల్పెర్ పోస్టులు ఉన్నాయన్నారు.

కార్పొరేషన్ అధికారులకు సూచనలు

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పాలక సంస్థ ఉన్నతాధికారులతో సి. డి.ఎమ్.ఎ కోటేశ్వరరావు. సమావేశం నిర్వహించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో వీడియో కాన్ఫరెన్స్ పద్దతిన కార్పొరేషన్ కమిషనర్, అన్ని విభాగాల ఉన్నతాధికారులతో పలు అంశాలపై సమీక్షించారు.వేసవి కాలంలో మంచినీటి సరఫరా, జగనన్న శాశ్వత భూహక్కు పథకం – రీ సర్వే విధానం, జగనన్న నగర బాట – రోడ్ల రిపేర్లు, క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమం, స్పందన వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు.

తప్పిన ప్రమాదం

సైదాపురం :మండలంలోని గిద్దలురు గ్రామంలో మంగళవారం రాత్రి కారు వేగంగా నడుపుతూ విద్యుత్ పోల్‌ను ఢీ కొంది. దీంతో పోల్ విరిగి కారుపై పడింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ వేగంగా, నిర్లక్ష్యంగా కారును నడపడంతో ప్రమాదం జరిగిందని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

4న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -నెల్లూరు డెస్క్:నెల్లూరు నగరంలోని ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఈనెల 4వ తేదీన ఐసిఐసిఐ బ్యాంకు ప్రతినిధులు నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన నిమిత్తం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు బయోడేటా, ఆధార్ కార్డు, పాన్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లను వెంట తీసుకుని రావాలని ప్రతినిధులు సూచించాచరు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేసులను ఉపసంహరించుకోవాలి : యుటిఎఫ్

ఉపాధ్యాయ ఉద్యమ నేత 'దాచూరి'కి ఘన నివాళి

కందుకూరులో..

నెల్లూరు : ఉపాధ్యాయులు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకొనే నేపథ్యంలో చేపడుతున్న ఉద్యమాల సందర్భంగా ఉపాధ్యాయులపై నమోదు చేస్తున్న కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమనేత దాచూరి రామిరెడ్డి 7వ వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వి.శేషులు అధ్యక్షత వహించారు. దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.యుటిఎఫ్ ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘాలు పెట్టుకోవడం.. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయడం తమ హక్కు అన్నారు. అటువంటి హక్కును ప్రభుత్వం కాలరాసేందుకు ప్రయత్నిస్తే తాము సహించమన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని ఆర్భాటంగా హామీలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ దిశగా ఆలోచన ప్రభుత్వం చేయడం లేదన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రదర్శనలు చేస్తుంటే గృహనిర్బంధం చేయడం ఎందుకని ప్రశ్నించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యా రంగ సంస్కరణల పేరుతో విద్యా వ్యవస్థను అస్థవ్యస్థం చేయడం మంచిది కాదన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు ఒక ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలన్నారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి.బాబురెడ్డి , శ్రీహరి, కొండాచారిలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తూ ఉపాధ్యాయ ఉద్యమాలను నిర్మించిన దాచూరి రామిరెడ్డిని నేటి తరం ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.శేషులు, చలపతి శర్మ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎం.సి అచ్చయ్య, ఎ.విజయకుమారి, కోశాధికారి ఎ.మురళీధరరావు, జిల్లా అధ్యక్షులు సురేంద్రబాబు, కె.నాగిరెడ్డి, ఎస్‌కె ఖాజావల్లి, జి.దయాకర్, బి.శివప్రసాద్, యుటిఎఫ్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కందుకూరు : దాచూరి రామిరెడ్డి 7వ వర్ధంతి కార్యక్రమం యుటిఎఫ్ కందుకూరు డివిజన్ శాఖ ఆధ్వర్యంలో డిఆర్ఆర్ విజ్ఞాన్ భవన్‌లో జిల్లా కార్యదర్శి పి మురళీ కష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సీనియర్ నాయకులు ముప్పరాజు కోటేశ్వర రావు, జెవివి నాయకులు టివివి కష్ణకుమార్, సిహెచ్ ఉమామహేశ్వర రావు, మక్కేన రమేష్, తిరుపతి స్వామి, జి మాధవ రావు, కామేశ్వరరావు, ఓవి రమణయ్య, ఎస్ విప్రనారాయణ, ఎన్ వెంకటేశ్వర్లు, ఆరికట్ల శ్రీనివాసరావు, టి సరోజిని, ఎస్ ప్రసన్న మొదలైనవారు హాజరై మాట్లాడారు. దాచూరి రామిరెడ్డి ఆశయ సాధనలో కృషి చేయాలన్నారు.

పొదలకూరు :పొదలకూరులోని యుటిఎఫ్ భవనంలో మంగళవారం దాచూరి రామిరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దాచూరి చిత్రపటానికి పూల మాలు వేసి నివాళి అర్పించారు. దాచూరి జీవిత విశేషాలను యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి వెంకటేశ్వర్లు వివరించారు.

నెల్లూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత ఎన్ వెంకటేశ్వర్లు

పొదలకూరులో దాచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, మండల కార్యదర్శి మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వరిగొండ, కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రసాద్ రాజా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో కీలకంగా పనిచేస్తూ సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ. 26 వేలు కనీస వేతనం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

సాంప్రదాయేతర పంటల సాగుపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-నెల్లూరు :సువిశాల తీరప్రాంతం, సారవంతమైన భూముల సౌలభ్యం నేపథ్యంలో సాంప్రదాయేతర పంటల వైపు రైతులను ప్రోత్సహించవలసిందిగా సంబంధిత అధికారులను కలెక్టర్ యం. హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో మత్స్య శాఖ, ఉద్యానవన శాఖల పై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా లోని మత్స్య కారులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు సమయానుకూలంగా వారికి అందిస్తూ వారి అభివద్ధికి తోడ్పడాలన్నారు. మత్స్యకార భరోసా లబ్ధిదారులు గురించి విచారించారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అమలు తీరుతెన్నులను విచారిస్తూ సాగు విస్తీర్ణం పెరగాలన్నారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి సుబ్బారెడ్డి, ఎ పి యం ఐ పి పిడి శ్రీనివాసులు, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల నష్టం పట్టదా..!

టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : వర్షానికి, అకాల వర్షానికి తేడా తెలియని వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అని, రైతులు కష్టాల్లో ఉంటే అధికారులను అప్రమత్తం చేయడం, సమీక్షలు నిర్వహించే బాధ్యత లేదా అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నగరంలోని ఎన్‌టిఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయ శాఖను మూసేసి టీడీపీ నాయకులని, పత్రికలను తిట్టుకుంటూ గడిపేస్తారా అని అన్నారు. కాకాణి ఇప్పటికైనా నిద్రలేచి, ..అకాల వర్షాలతో రైతులకు జరిగిన నష్టాన్ని అంచనావేసి పరిహారం చెల్లించాలన్నారు. టీడీపీ పాలనలో వ్యవసాయ శాఖకు కేటాయించింది ఎంత..ఖర్చుపెట్టింది ఎంత..వైసీపీ పాలనలో కేటాయింపులెంత. ఖర్చెంతో శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా అన్నారు. ఏప్రిల్ 23 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలు భారీగా కురుస్తున్నాయని, ఒక్కో ప్రాంతంలో సాధారణ వర్షపాతం కంటే 170 కంటే 200 శాతం వరకు అధికంగా నమోదవుతోందన్నారు.ఈ అకాల వర్షాలు రైతులను తీవ్ర కష్టనష్టాలకు గురిచేస్తున్నా యన్నారు. ధాన్యం, అరటి, మొక్కజొన్న, మిరప తదితర పంటలు వేసిన రైతులు భారీగా నష్టపోయారన్నారు. సుమారు 4 లక్షల ఎకరాల్లో పంటలు, తోటలకు నష్టం జరిగింద న్నారు. ఒక్కో పంటను బట్టి ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందన్నారు. అప్పట్లో వ్యవసాయమంత్రికి, అధికారులకు దెబ్బతిన్న పంటలను పరిశీలించే తీరిక లేకుండా పోయిందా అని ప్రశ్నించారు. ఇదేమి అన్యాయమని ప్రశ్నిస్తే వర్షాలు కురవడం తెలుగుదేశం పార్టీ నాయకులకు ఇష్టం లేదని మంత్రి కాకాణి సెలవివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.3,759 కోట్లు ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చామని, .దానికి కొనసాగింపుగా ఇప్పడు ప్రభుత్వం నిధులు ఇవ్వాలన్నారు.



మాట్లాడుత్ను సోమిరెడ్డి

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ డి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పోలినేనిపాలెం తదితర గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఎస్ఐ బిబి మహేంద్ర, సెబ్ ఎస్ఐ డి మౌలాలి, సిబ్బందితో మహిళా పోలీసు టి ప్రసన్న ఉన్నారు.

నేరాలపై నిఘా : ఎస్ఐ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలో జరిగే నేరాలపై నిరంతరం నిఘా ఉంచుతామని ఎస్ఐ మహేంద్ర తెలిపారు. వలేటివారిపాలెం పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా మహేంద్ర ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెం, పోకూరు గ్రామాల్లో ట్రాఫిక్ నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

జడ్జి రాజాను కలిసిన కలెక్టర్

నెల్లూరు : మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.రాజా మంగళవారం నగరానికి వచ్చారు. అర్ అండ్ బి అతిథి గృహంలో బస చేసిన జస్టిస్ టి.రాజాను కలెక్టర్ ఎం. హరినారాయణన్, ఎసిబి కోర్టు జడ్జి సత్యవాణి మర్యాద పూర్వకంగా కలిశారు.ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకున్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి టి .రాజా పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. మొబైల్ కోర్టు జడ్జి లావణ్య,నెల్లూరు ఆర్డీవో మాలోల కూడా ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సామాజిక భద్రతకు పెద్దపీట

తోటపల్లిగూడూరు :సామాజిక భద్రతే పిఎంజెజెబివై, పిఎంఎస్బివైల ముఖ్య ఉద్దేశ్యమని ఇందుకూరుపేట ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం సంఘమిత్ర కార్యాలయంలో మైక్రో ఫైనాన్స్ (సూక్ష్మ రుణాలు)పై సమావేశం జరిగింది. అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపిఎం) శైలజ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయన మాట్లాడుతూ సామాజిక భద్రత కవర్‌లో భాగంగా అందరికీ జీవిత, ప్రమాద బీమాను అందించడం లక్ష్యంగా పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై పని చేస్తున్నాయన్నారు. ఎ కారణాలతో మరణం సంభవించినా రూ. 2 లక్షల బీమాను పిఎంజెజెబివై అందిస్తుండగా, పిఎంఎస్‌బివై ప్రమాదంలో మరణించిన వారికి లేదా పూర్తి శాశ్వత వైకల్యం పొందినవారికి రూ. 2 లక్షలు బీమాను, పాక్షిక లేదా శాశ్వత వైకల్యాన్ని పొందిన వారికి రూ. 1 లక్ష బీమాను అందిస్తున్నట్లు శ్రీనివాసులు తెలిపారు.కెనడా బ్యాంకు కో ఆర్డినేటర్, ఎం.ఎస్ ప్రెసిడెంట్, విఓ ప్రెసిడెంటులు కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, వివిఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసులు

దుస్తులు పంపిణీ

కందుకూరు :కందుకూరు షైన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం దుస్తులు పంపిణీ చేయడం జరిగింది.ఊరి బయట శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు షైన్ ఫౌండేషన్ వారు దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. ఫౌండేషన్ ప్రెసిడెంట్ రహీం మాట్లాడారు. షైన్ ఫౌండేషన్ ప్రతినిధులు నయీమ్, బాషా వెంకటేశ్వర్లు, గౌస్ ,బాబు, కరీముల్లా, డాక్టర్ రాయ్, పాల్గొన్నారు.

పొదలకూరు : పొదలకూరు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త కృష్ణం యానాదిశెట్టి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన భార్య సులోచన నరసారెడ్డి కాలనీ లోని లక్ష్మీ మహిళా మండలి వద్ధాశ్రమంలోని వద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి- నెల్లూరు : జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమానికి పంచాయతీరాజ్ అధికారులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని తిక్కన మీటింగ్ హాల్ లో డివిజనల్ పంచాయతీ అధికారులు, ఇఒ పిఆర్‌డిలతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ,తాగునీటి సరఫరా, వీధి దీపాలు, గ్రామీణ రోడ్ల నిర్వహణ పై ఇఒపిఆర్‌డిలు, గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గ్రామాలలో వాటర్ ట్యాంకులు,ఓహెచ్ఎస్ఆర్, సంపులు, ప్రతి 15 రోజులకు ఒకసారి కచ్చితంగా పరిశుభ్రం చేయాలన్నారు , త్రాగునీటి వనరులు క్లీనింగ్ చేసినది రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు.

యూజర్ ఛార్జీలు చెల్లించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణ యూజర్ చార్జీలను క్రమం తప్పకుండా చెల్లించి నగరాభివద్ధికి తోడ్పడాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. మంగళవారం స్థానిక 29 వ డివిజను గాంధీ నగర్ పార్క్ ప్రాంతంలోని శానిటేషన్ మస్టర్ పాయింట్ ను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా డివిజన్ పరిధిలోని శానిటేషన్ సిబ్బంది హాజరును కమిషనర్ పరిశీలించారు. నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ సూపర్వైజర్లు, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం : కాకాణి

పొదలకూరు : రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగు తోందని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.మండలంలోని మొగళ్లూరు పంచాయతీ పరిధిలోని గురవాయపాలెంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. తొలుత ఆయన రూ. 84 లక్షల వ్యయంతో నిర్మించిన వివిధ అభివద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరిపారు. మండల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల వైకాపా నాయకులు జి. గోపాల్ రెడ్డి, కె. చిన్న బ్రహ్మయ్య, వాకాటి శ్రీనివాసులు రెడ్డి, ఏనుగు శశిధర్ రెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

'ఉపాధి' పనులపై సమీక్ష

నెల్లూరు : 'ఉపాధి' పనుల్లో జిల్లాను ముందంజలో నిలపడానికి డ్వామా అధికారులు కషి చేయాలని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ కోరారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు తీరుపై డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట్రావు, అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల , ఎపిడిలతో సమీక్ష నిర్వహించారు. అధికారులను ద్ధేశించి కలెక్టర్ హరి నారాయణన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మంచి ఫలితాలు సాధించడానికి అందరూ సమిష్టిగా పనిచేసి లక్ష్యాలు సాధించాలన్నారు.

12న కావలికి సిఎం జగన్ రాక

ప్రజాశక్తి-కావలి : కావలి మినీ స్టేడియంలో 12న జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పాల్గొంటారని కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌తో కలిసి పట్టణంలో సిఎం హెలికాప్టర్ దిగేందుకు హెలిప్యాడ్ నిర్మించేందుకు స్థల పరిశీలన చేశారు. బహిరంగ సభ జరిపేందుకు మినీస్టేడియం మైదానాన్ని పరిశీలించారు. వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం కోసం జవహర్ భారతి కళాశాల మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కావలిలో వేలాదిమందికి ఇళ్ళ చుక్కలభూమి సమస్యను పరిష్కరించేందుకు, ఉదయగిరి బ్రిడ్జి పై ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం, కావలి పట్టణ ఆధునీకరణ వంటి అభివృద్ధి పనులను అందజేసేందుకు కావలికి విచ్చేస్తున్నారని వివరించారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు

ప్రజాశక్తి-కావలి : కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఎన్ఎస్ఎస్ క్యాంపు శనివారం ముగియడంతో మంగళవారం ముగింపు వారోత్సవాలను నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్ శంకర్ అల్ల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య డిగ్రీకళాశాల డైరెక్టర్ పి.జానకిరామ్, ఎన్.మధుసూధన రావు, ఎన్.వెంకయ్య, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ పి.వి.సాయి తేజ పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఆపదమిత్ర వాలంటీర్లకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీదేవి మాట్లాడుతూ విపత్తు సమయంలో ప్రజలకు రక్షణగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇటీవల 31 మంది వెంకటాచలంలో శిక్షణను పూర్తి చేసుకొన్నారని హర్షం వ్యక్తం చేశారు. ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, జూనియర్ అసిస్టెంట్ నాగరాజు వైసిపి మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు, నీలం సాయికుమార్, షేక్ ఉస్మాన్ షరీఫ్, చెంబటి శ్రీనివాసులు తదితరులున్నారు.

విద్యార్థులకు పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి : ఆల్వారి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కిరణ్ అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు సాధించిన అత్యుత్తమ మార్కులకు కృషి చేసిన ప్రిన్సిపాల్‌ను, అధ్యాపకులను పలువురు అభినందిస్తూ తెలియజేశారు. అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి-సీతారామపురం : టిబి వ్యాధిగ్రస్తులకు అదనపు పౌష్టికాహార పథకంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏడు మంది టిబి వ్యాధిగ్రస్తులకు అదనపు పౌష్టికాహారాన్ని వైద్యాధికారి ఎం.రవికుమార్ అందించారు. మండలంలో టిబి, పౌష్టిక ఆహారం తీసుకొని తొందరగా రికవరీ కావాలని ఆయన సూచించారు. టిబీ ఉచిత 2025 నాటికి పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో స్వప్న, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు పిహెచ్‌సి సిబ్బంది సొంత నిధులతో మంగళవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. వైద్యాధికారి బాలచంద్రబాబు, సిహెచ్‌ఒ సోమశేఖర్, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఎస్ షేక్ ఉస్మాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

6వ తేదీలోపు ఈకెవైసి చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు ఉప ఖజానా పరిధిలో పెన్షన్ దారులు ఈ కెవైసి సమర్పించడానికి ఆఖరుగా 6వ తేదీ వరకు ఉంటుందని ఆత్మకూరు ఉప ఖజానా కార్యాలయ ఎటిఓ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ దారులు ఎవరైతే ఈకెవైసి (సిఎఫ్ఎంఎస్)కు ఆధార్ లింక్ చేయడం సమర్పించని వారు తప్పక 6వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు.

పశువైద్యాధికారులను నియమించాలి

ప్రజాశక్తి-వరికుంటపాడు : మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో రెగ్యులర్ పశువైద్యాధికారులను నియమించి సకాలంలో మూగజీవులకు వైద్యం అందేలా చూడాలని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ చల్లగాలి వెంకటమోహన్ డిమాండ్ చేశారు. వరికుంటపాడు పశువైద్యశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అధికారులు చొరవ చూపించి రెగ్యులర్ సిబ్బందిని నియమించి మూగజీవులకు సకాలంలో వైద్యం అందించాలని కోరారు.

సుధీర్‌బాబుకు సన్మానం

ప్రజాశక్తి-కావలి : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘాల జెఎసి రాష్ట్ర చైర్మన్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన దేవరకొండ సుధీర్‌బాబును ఘనంగా సన్మానించారు. మంగళవారం పట్టణంలోని వెంగళరావు నగర్‌లోని గిరిజన సంఘాల జెఎసి కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు పాలకీర్తి రవి, అధ్యక్షతన సన్మాన సభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జె.ఎ.సి రాష్ట్ర చైర్మన్ దేవరకొండ సుధీర్‌బాబు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల జెఎసి నాయకులు, రాష్ట్ర యువత అధ్యక్షులు మేలిగిరి పోటు, జిల్లా అధ్యక్షులు గున్నం రామారావు, జిల్లా బిసి అధ్యక్షులు వావిల్ల బాలాజీ, కావలి మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరిసిన ఆణిముత్యం

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తోటల చెరువుపల్లి గ్రామానికి చెందిన పిడుగు లావణ్య ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో గ్రూప్ హెచ్ఇసిలో ఉదయగిరి ప్రభుత్వ కళాశాలలో 414 మార్కులు సాధించి ప్రథమ స్థాయిలో ప్రతిభ చూపించింది. విద్యార్థిని సామాన్య కుటుంబం నుండి వచ్చి ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటూ అత్యధిక మార్కులు సాధించడంపై మంగళవారం గ్రామస్తులు కళాశాల ప్రిన్సిపాల్ లెక్చరర్లు అభినందించారు.

ఇందుకూరుపేట వాసి ఎంపిక

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : బెంగళూరులో 5వ తేదీన జరగబోయే రాష్ట్రస్థాయి ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ 2023కు జిల్లా నుండి ముగ్గురు ఎంపిక కాగా వారిలో ఒకరు మైపాడు గ్రామానికి చెందిన కె.యాదగిరి ఎంపికయ్యారు. తమ గ్రామ యువకుడికి అవకాశం కల్పించిన పారా స్పోర్ట్స్ నెల్లూరు అసోసియేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలో జరుగుతోన్న నాడు-నేడు పనులను జూన్ 10వ తేదీ కల్లా పూర్తి చేయాలని ట్రైనీ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నాడు-నేడు పనులు జరుగుతున్న 23 పాఠశాలల హెచ్ఎంలతో మంగళవారం ఆమె సమీక్షించారు. సమావేశంలో ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఎంఇఒ వసంతకుమారి, సిఆర్‌పిలు వీరాంజనేయులు, జె. పెంచలయ్య ఎం.దయాకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-ఉదయగిరి : ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త 1, అంగన్‌వాడీ సహాయకురాలు 3 పోస్టులు ఖాళీ ఉన్నాయని సిడిపిఒ వచ్చవ లావణ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. మే 3 నుండి మే 9 వతేరీఖు వరకు అప్లికేషన్స్ ఆ అంగన్‌వాడీ సెంటర్‌కు సంబంధించిన సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. **ప్రజాశక్తి-మర్రిపాడు** : అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని శెట్టిసముద్రం అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ తెలిపారు. దరఖాస్తుదారులు 10వ తరగతి ఉత్తీర్ణులై, 2022 జూలై 35 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారై ఉండాలన్నారు.

గిరిజనులను హింసించి రూ.కోట్లు దోపిడీ

- ప్రజాశక్తి కథనానికి స్పందన
- అవినీతి మత్తులో మత్స్యశాఖ
- వలలు తగలబెట్టి దాష్టీకం

ప్రజాశక్తి-అల్లూరు

అల్లూరు చెరువులో కోట్ల రూపాయల మత్స్య సంపదను దర్జాగా దోచుకుంటూ అభాగ్యులైన నిరుపేద గిరిజనులను హింసించి వైసిపి నేతలు దాష్టీకానికి పాల్పడ్డారని శంభన్‌కాపు పెద్ద పోతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం 1వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో వెలుడిన 'రూ.కోట్లలో దోపిడీ' కథనంపై స్పందించారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని చెర్లో సంఘం గ్రామంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి పలు అంశాలను ప్రస్తావించారు. తమ పూర్వీకులైన శంభన్ కాపులు, చెర్లో సంఘం, బోడిసత్రం గ్రామ గిరిజనులు 1952 సంవత్సరంలో 21 నెంబర్ ద్వారా ఫిషర్ మెన్ సొసైటీగా ప్రభుత్వ ఉత్తర్వులతో రిజిస్టర్ చేసినట్లు వివరించారు. తదుపరి 1957లో ఓ భూస్వామి అనేక మందికి తగాదాలు పెట్టి పట్టపులకు అనుకూలంగా పొన్నపూడి ఫిషరీస్ సొసైటీని ఏర్పాటు చేశారని తెలియజేశారు. అనంతరం 1991లో మరో భూస్వామి టిడిపిని అడ్డం పెట్టుకుని నాన్ లోకల్ వ్యక్తులతో న్యూ ఫిషర్‌మెన్ సొసైటీ ఏర్పాటుచేసి మత్స్య సంపదను రాత్రి, పగలు తేడా లేకుండా



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

దోచుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అత్యంత విస్తీర్ణమైన చెరువులు సర్వేపల్లి, అల్లూరు. స్థానిక చెరువు పూర్తి విస్తీర్ణం 2,700 ఎకరాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాటినుండి ఓ భూస్వామి ఆ చెరువు సంపదపై కన్నేసి కోట్ల రూపాయలు దోచుకుని అందులో చేపలను బహిరంగంగా తమిళనాడు, కర్ణాటక, ఇతర రాష్ట్రాలకు తరలించి సంపదను తన జేబులో వేసుకున్నారని తెలిపారు. అంతేకాకుండా హింసాకాండతో గిరిజనుల వలను లాక్కొని కాల్చి వేసిన సంఘటనలు కోకోల్లుగా ఉన్నాయన్నారు. అభాగ్యులైన కొందరిపై అక్రమ కేసులు బనాయించి పైశాచిక ఆనందాన్ని పొందారని విచారం వ్యక్తం చేశారు. అల్లూరు పంచాయతీలోని 25 గిరిజన కాలనీలకు రూ.25 లక్షలు అలాగే శంభన్ కాపులకు రూ.15 లక్షలు ఇస్తానని మభ్యపెట్టినట్లు గుర్తు చేశారు. సంబంధిత విషయంపై పూర్తిగా స్పందించాలని అధికారులకు వివరించినా వ్యంగ్యంగా మాట్లాడుతూ పెడచెవిన పెడుతున్నారని దుయ్యబట్టారు. కొంతమంది అవినీతి అధికారుల వల్ల మత్స్య సంపదకు భద్రత లేకుండా పోతుందన్నారు. జిల్లా కలెక్టర్ చొరవతో విచారణ జరిపి తగు న్యాయం చేయాలన్నారు. అనంతరం నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్, మండల వైసిపి ఎస్‌టిసెల్ మండల అధ్యక్షులు దాసరి పోలయ్య మాట్లాడుతూ గిరిజనులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతానని హామీనిచ్చారు. కోట్ల రూపాయలు దోచుకున్న వారిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇతర జిల్లాల నుంచి మనుషులను పిలిపించి గిరిజనులకు జీవన భృతి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తపరిచారు. అక్రమ మత్స్య సంపదను కొల్లగొడుతూ తమపై దాడులు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. సంబంధిత విషయంపై కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆయన సతీమణి ఆదిలక్ష్మి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకూ న్యాయ పోరాటం సాగిస్తానని హామీనిచ్చారు. కార్మిక దినోత్సవం మేడే రోజున మత్స్య సంపదను కోట్లలో దోచుకుంటున్నారని ప్రజాశక్తిలో కథనం రావడంతో అధికారులు ఖంగుతున్నారు. వైసిపి నేతలు వెంటనే చేపల వేటను నిలిపివేసి గుడిసెలను తీసివేశారు.

భూ సమస్యను పరిష్కరించండి సారూ..

ప్రజాశక్తి-కావలి

తమ బాధలను తెలుపుతున్న బాధితులు

తమ పొలం వివాదంలో చిక్కుకుందని, ఆ సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయాలంటూ బాధిత వృద్ధురాలు కాకు కోటమ్మ మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వాపోయింది. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ కావలి మండలం పెద్దవరం గ్రామంలో తాము 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న మెట్ట భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకొని అధికార పలుకుబడితో దౌర్జన్యానికి దిగి తమ భూమిలోకి దిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేసింది. సర్వే నెంబర్ 841/1లో తాను, తన ఇద్దరు కుమారులు తలా రెండు ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిలో చెట్లు కంపను కొట్టేసుకుని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. మొదటి మినుము పంట వేసుకొంటుండగా పశువులు పడి పంట సరిగా రాకపోవడంతో 2014లో జామాయిల్ సాగు చేసుకున్నామని తెలిపారు. అయితే అప్పుడు పంచాయతీకి శిస్తు కూడా కట్టినట్లు తెలిపారు. అయితే జామాయిల్ కర్ర చేతికి వచ్చాక దానిని కట్ చేయిస్తుండగా తమ గ్రామానికి చెందిన బొబ్బిల కొండయ్య, ఆయన భార్య అనుసూయమ్మ, వారి కుటుంబ సభ్యులు మా పొలంలోకి చొరబడి కర్ర కొట్టేదానికి లేదని తమకు భాగం ఉందని అడ్డుపడ్డారన్నారు. అయితే అప్పుడు దీనిపై కావలి తహశీల్దార్‌కు పోలీసులకు తెలిపామన్నారు. అనంతరం దీనిపై జిల్లా కలెక్టర్‌కు కూడా అర్జీ అందజేశామన్నారు. 1వ తేదీన కావలి రెవెన్యూ సర్వేయర్ శ్రీనువాసుల రెడ్డి తమకు ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా తాము సాగు చేసుకుంటున్న భూమిని బొబ్బిలి కొండయ్య వాళ్లకు కొలతలు వేసి ఏకపక్షంగా రాసి ఇచ్చేందుకు వచ్చారన్నారు. విషయం తెలుసుకున్న తాము సర్వేయర్‌ను నిలదీయడంతో తమకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఉన్నాయని తెలిపి వెళ్లి పోయాడన్నారు. అయితే తమకు గ్రామంలో సెంటు భూమి కూడా లేదన్నారు. కలెక్టర్ స్పందించి తాము సాగు చేసుకుంటున్న భూమిని తమకే ఉండేలా చర్యలు తీసుకుని బొబ్బిలి కొండయ్య కుటుంబ సభ్యుల నుంచి ప్రాణరక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాకు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

- రూ.2లక్షల ఆస్తినష్టం

ప్రజాశక్తి-కోవూరు

పట్టణంలోని కొత్తూరు ఉలసాగు మేకాలమ్మ గుడి ప్రాంతంలో ఇంతా శ్రీకాంత్ రెడ్డి కౌలు రైతు అప్పు చేసి డెయిరీ ఫామ్ ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆ ప్రాంతంలో తాగుబోతులు మోటార్ వైర్లు దొంగలిస్తున్నారు. దీంతో రైతులందరూ కలిసికట్టుగా ఈ ప్రాంతంలోని మోటార్ వైర్లు దొంగలిస్తున్నారని అడిగినందుకు కౌలు రైతు అయిన శ్రీకాంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ 20 రోజుల క్రితం 20 ఎకరాల గడ్డివాములను దగ్ధం చేశారు. మళ్లీ సోమవారం అర్ధరాత్రి 40 ఎకరాల గడ్డివాములను తగలబెట్టారు. ఈసందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎప్పుడు ఇటువంటి ఘటనలు జరగలేదన్నారు.. దురదష్టకరం పలుదపాలుగా పోలీసులకు విన్నవించి నివారించమని కోరినా ఫలితం శూన్యమన్నారు. ప్రభుత్వమే ఈ అసాంఘిక శక్తులను ప్రోత్సహించి కల్తీ మద్యాన్ని అక్రమ గంజాయి వ్యాపారాన్ని నడుపుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో కొత్తగా వచ్చిన ఎస్‌పి తిరుమలేష్ రెడ్డి గంజాయిని పట్టుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. అక్రమ గంజాయి, మద్యం, మైనింగుల్లో అధికార పార్టీ యంత్రాంగానికి విచ్చలవిడిగా కమీషన్లు అందుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసాంఘిక కార్యకలాపాల పైన ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. గడ్డివామిని పరిశీలించిన వారిలో గండవరపు శేషయ్య, ఎస్‌కె. బాబు, జి.బుజ్జయ్య, వి.మల్లికార్జునరెడ్డి, బి. పెద్దన్న, జి.విజయ్ కుమార్, పి.సురేంద్ర, టి.రమేష్, షేక్ కాలేషా, షేక్ కరీముల్లా, ఎన్.మోహన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మహిమలూరు గ్రామానికి చెందిన యువకుడు నువ్వూరుపాడు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివశంకర్ రావు తెలిపిన వివరాల మేరకు.. మహిమలూరు గ్రామానికి చెందిన దేవరపాటి బ్రహ్మయ్య కుమారుడు దేవరపాటి గోపి(34) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. వివాహితుడైన ఇతడు ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. తన స్నేహితుడు గ్రామానికి చెందిన ఆర్.ఎం.పి. వైద్యుడుతో కలిసి మంగళవారం కారులో ఆత్మకూరుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో నువ్వూరుపాడు సమీపంలో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న వ్యక్తి స్తంభాన్ని ఢీకొన్నది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న గోపి తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయాడు. సమీపంలో ఉన్నవారు పరిశీలించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ శివశంకరరావు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించి గోపి మృతి చెందిన విషయాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలపై తరలించారు. ఆర్.ఎం.పి వైద్యుడు చిన్నపాటి గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన గోపి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పాల్గొని మండలంలోని సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మండలంలో ఉన్న 16 పంచాయతీల్లో ఉన్న సమస్యలను సత్వరమే పూర్తి చేసలా అధికారులతో చర్చించామని తెలిపారు. గ్రామాలలోని సమస్యలను ప్రజలు గ్రామ వాలంటీర్లకు తెలపాలని, సమస్యను సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో ప్రజలకు న్యాయం జరిగేలా వాలంటరీ వ్యవస్థ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్‌కుమార్, ఇఒపిఆర్‌డి శ్రీదేవి, సీనియర్ నాయకులు పెంచలయ్య, రమణయ్య, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఇఒ జయంత్ బాబు, గృహ నిర్మాణ శాఖ ఎఇ వెంకటయ్య, వ్యవసాయ శాఖ అధికారిణి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి..

ప్రజాశక్తి-ఉదయగిరి : నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి ప్రతి ఒక్కరినీ కలుపుకొని పూర్తి స్థాయిలో కృషి చేస్తామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ జెడ్‌పి చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 8 మండలాల పరిధిలో ఉన్న నాయకులను కొత్త, పాత అని తారతమ్యం లేకుండా అందరినీ ఒకే తాటిపై తీసుకొచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీలోకి కొత్త వారిని చేర్చుకున్న వారికి తగిన ప్రాధాన్యత గుర్తింపు ఉంటుందన్నారు. అనేక ఇబ్బందులను ఎదుర్కొని గత నాలుగు సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న నాయకులకు, కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. ఉదయగిరిలో వైసిపి పరిస్థితి ఎంఎల్ఎ లేక, ఇన్‌ఛార్జి లేక లంగరు లేని నౌకగా ప్రయాణం చేస్తుందని ఎద్దేవా చేశారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా చంద్రబాబు ముఖ్య మంత్రిని చేసుకుందామా అని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సి.రమణయ్య, సుమన్, మస్తాన్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వీడాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-ఉదయగిరి : సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు విధుల్లో నిర్లక్ష్యం వాడాలని ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. మంగళవారం స్థానిక బిట్ -3 సచివాలయంలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తప్పనిసరిగా 100శాతం హాజరువేసి 10:30లోపు సచివాలయాల్లో విధులకు హాజరు కావాలని హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ పథకాల సర్వేలు 100శాతం పెండింగ్ లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తూ విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యాహరిస్తే చర్యలు తప్పవని సూచించారు. హౌసింగ్‌కి సంబంధించిన లిస్టులు గ్రామ వాలంటీర్ల వారీగా ఇచ్చి, వారు ఇల్లు త్వరగా పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖాదర్ కరిముల్లా, మండల కో ఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ఉద్యోగ విజయోత్సవం

ప్రజాశక్తి - కావలి



కావలి, రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీల్‌కుమార్ ప్రియా ఆధ్వర్యంలో ఉద్యోగ విజయోత్సాహం నిర్వహించారు. కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలకు సంబంధించిన మంచినీరు, ప్రహరీగోడ నిర్మాణం, గ్రౌండ్ లెవలింగ్ పనులు పూర్తిచేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమానికి ఆర్‌డిఒ వి.కె. శీనానాయక్, ఎడిఇ ఎం.భాను నాయక్, జెడ్‌పిటిసి జంపాని రాఘవులు, డి.బి.ఎస్. ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్, వైసిపి నాయకులు దామిశెట్టి సుధీర్‌నాయుడు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్, ప్రియా, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై కక్ష సాధింపు తగదు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

జూడోయాత్ర ముగిసిన వెంటనే తమ నాయకులు రాహుల్ గాంధీపై బిజెపి ప్రభుత్వం కక్ష సాధింపుగా ఎంపి పదవి నుంచి తొలగించి, వెంటనే ఉన్నఫలంగా ఇంటి నుంచి పంపి వేయడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ నేత పల్లంరెడ్డి యశోద ఖండించారు. మంగళవారం మండలంలోని జగదేకవీపేట గ్రామంలో ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడపగడపకు వెళ్లి రాహుల్ గాంధీని ఆహ్వానిస్తూ ఉండే స్టిక్కర్లను ఇండ్లకు అతికిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలు బాగుపడాలంటే ప్రజలు స్పందించి నిలదీయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

ఎంఎల్ఎ అభ్యర్థిని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి నియోజవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డిని ఉదయగిరి, సీతారాంపురం, దుత్తలూరు మండల నాయకులు కలిశారు. మగళవారం బెంగుళూరు తన నివాసంలో సీతారాంపురం మండల కన్వీనర్ చింతంరెడ్డి, శకునాలపల్లి సర్పంచ్ కల్లూరు వెంకటేశ్వరరెడ్డి, సీతారాంపురం సర్పంచుల సంఘం అధ్యక్షులు తిరుపతిరెడ్డి, సీతారాంపురం జేసిస్ మండల కన్వీనర్ బాలినేని మాబాయ్య, సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గం ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అమలు తీరు, జగనన్నే మా భవిష్యత్తు విజయవంత కార్యక్రమం పలు అంశాలను ఆరా తీశారు. వీరివెంట పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు మంగళవారం మండలంలోని నువ్వూరుపాడు సచివాలయంలో ఎంపిడిఒ సి.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అందరూ సచివాలయం సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు వేయాలని, ఏ ఒక్కరికీ మినహాయింపు లేదన్నారు. మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి వచ్చిన అర్జీలను రిజిష్టర్‌లో నమోదు చేసి సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ప్రసన్న, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయంలో డిసిఒ తనిఖీ

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని యల్లాయపాలెం సహకార సంఘం కార్యాలయాన్ని జిల్లా సహకారాధికారిణి బీ.సుధాభారతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని పరిశీలించి సచివాలయం ద్వారా అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ రైతులకు సహకార సంఘాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఆమె వెంట ఎన్డీఎల్సీఓ ఎంవి.సుభాషిణి, కోవూరు సీనియర్ ఇన్‌స్పెక్టర్ పి.శివకుమార్, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక ఆర్ సునీల్ రెడ్డిలు ఉన్నారు.

లోకస్ ట్రైనింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేటలోని వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో 5 రోజులపాటు నిర్వహించనున్న ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో మంగళవారం ఎపిఎం సతీష్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపిఎం సతీష్ మాట్లాడుతూ లోకస్ జాతీయస్థాయి కార్యక్రమంలో శిక్షణ పొందిన వారు మండలంలోని విఒఎలకు మొదటిరోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం, సిసిలు విఒలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : మండలంలోని విఒఎలకు లోకస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో లోకస్ యాప్‌పై 4 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మొదటి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2వ రోజు శిక్షణ తరగతులు ఉంటాయని, మూడవరోజు ఫీల్డ్ విజిట్ కార్యక్రమం ఉంటుందని, 4వ రోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎపిఎం వెంకమ్మ సిసిలు, విఒఎలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : స్థానిక మండల సమైక్య కార్యాలయంలో మంగళవారం లోకస్ యాప్‌పై నాలుగు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఏరియా కోఆర్డినేటర్ జి.శేషారెడ్డి, హెచ్డి డిపిఎం సుబ్బరాజు ప్రారంభించారు. ప్రధానంగా ఈ లోకస్ యాప్‌లో దేశంలోని పొదుపు సంఘాలకు సంబంధించి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను పొదుపు సంఘ సభ్యులకు అందజేయాలని ఉద్దేశంతో లోకోస్ యాప్‌ను నిర్వహించారని, ప్రజలకు కేంద్ర ప్రభుత్వం నుండి పథకాలను అమలు చేయడానికి లోకస్‌యాప్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఎం బిడబ్ల్యు. సుధాకర్ రావు, అన్ని సంఘ బంధాల విఒఎలు, క్లస్టర్ సిసిలు, అకౌంటెంట్ మండల సమైక్య ఒబి పాల్గొన్నారు.

500మంది పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం కచ్చేరిమిట్ట నివాసులు శిఖరం.శ్రీనివాస వరప్రసాద రావు రెండవ వర్ధంతి సందర్భంగా మంగళవారం వారి సతీమణి శిఖరం.సుజాత, వారికుమా రులు, సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో బుడంగుంట గిరిజన కాలనీ, శివరామ సుబ్బయ్య కాలనీ, పెంకుల ఫ్యాక్టరీ చెరువు కట్ట సంఘం, కాలేరుగుంట, కావలి పట్టణంలోని యాచకులకు, ముసునూరు వినాయక కాలనీలోని నిరుపేదలకు 500 భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బెజవాడ రవికుమార్, విశ్రాంత హెచ్‌ఎం ఎం.అజిత్ బాబు పాల్గొని భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎస్.రమ్య, షేక్.సమీరా పాల్గొని సేవలందించారు.

4న 'ఎంఎస్ఆర్'లో ప్లేస్‌మెంట్

ప్రజాశక్తి-కావలి : ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో 4న గురువారం విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కర స్పాండెంట్ గుంటుపల్లి రాజ్ కుమార్‌చౌదరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. హెటెరో ల్యాబ్స్ కంపెనీ ప్రతి నిధులు ఈ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నా రని, ఏ కాలేజీకి సంబంధిం చిన విద్యార్థులైనా పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9603 263382, 7893679141, 90006 60259 సంప్రదించాలని తెలిపారు.

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్ :పట్టణంలోని సోమశిల సెంటర్ ప్రాంతంలో స్థానిక ఎస్ఐ శివ శంకర్ రావు మంగళ వారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాలకు సరైన పత్రాలు ఉన్నాయా.. లేవా.. అని తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. లేనిపక్షంలో వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాకర్ల సురేష్‌కు లోకేష్ ప్రశంసలు

ప్రజాశక్తి-జలదంకి

కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్‌ను టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ప్రశంసించారు. లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రలో సురేష్ పాల్గొన్నారు. ఉదయగిరిలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులను చర్చించారు. వరికుంటపాడు మండలం ఎర్రగుంట పాలానికి చెందిన కాకర్ల సురేష్ మూడు నెలల క్రితం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు లోకేష్‌కు తెలియజేశారు. ఈ ట్రస్ట్ ద్వారా ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్నట్లు, ప్రజా మన్ననలు చూరగున్నారన్నారు. ఒకవైపు అభాగ్యులకు ఆర్థికసాయం అందించటంతో పాటు అన్నార్థులకు అన్న క్యాంటీన్ ద్వారా ఆకలి డప్పులు తీరుస్తున్నారన్నారు. మరొకవైపు రోగులను ఆదుకునే అందుకు సంజీవని ఆరోగ్య రథం ఏర్పాటు చేసి వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలియజేశారు. ఇదిలా ఉండగా ఉదయగిరి నియోజకవర్గంలో టిడిపి వర్గ పోరు కొనసాగుతుదని, ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదర్చలేక ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చేతులెత్తేశారని తెలియజేశారు. వర్గ విభేదాలు రచ్చకెక్కడంతో ఆయన నియోజకవర్గానికి పార్టీ పెద్దలకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో టిడిపి కేడర్ నిరుత్సాహంతో పాటు నైరస్యం నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ పేరిట సురేష్ అరంగేట్రం చేశామని, ఆ పార్టీ కేడర్లోనూ నూతన ఉత్సాహం నెలకుందని తెలియజేశారు. ఎన్‌టిఆర్ ఆశయాలను రాష్ట్ర సంక్షేమం కోసం పాటుపడుతున్న చంద్రబాబును చూసి స్ఫూర్తిగా తీసుకొని తనవంతు సేవలను అందించే అందుకే వచ్చానంటూ సురేష్ పేర్కొన్నారు. పత్రికలు, వార్త ఛానల్‌ను, సోషల్ మీడియా ద్వారా సురేష్ చేపడుతున్న సేవాకార్యక్రమాలు తెలుసుకున్న లోకేష్ పరవశించి పోయారు. సంస్థ గతంగా ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమాలను ఒక వ్యక్తిగా కాక శక్తిగా నడిపిస్తున్నవని

'యువగళం'లో లోకేష్‌తో నడుస్తున్న కాకర్ల సురేష్

సురేష్‌ను లోకేష్ అభినందించారు. అనంతరం సురేష్ నారా లోకేష్‌తో ప్రత్యేకంగా భేటీ అయి పలు రాజకీయ అంశాల గురించి చర్చించారు. ఈ విషయం నియోజకవర్గంలో దావనంల వ్యాపించడంతో అన్ని వర్గాలలో చర్చనీయాంశమైంది.

మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్
కందుకూరు మునిసిపాలిటీ, కందుకూరు - 523105

ఆర్.ఓ.సి నెం. 976/2022/ E1 & 272/2023/E1, తేది: 29.04.2023

మొత్తం పనుల సంఖ్య	: **06 Special Grant (Development Works)** (రెండు పిలుపు) **02 General Funds**
మొత్తం పనుల అంచనా విలువ	: 89.14 లక్షలు **(Special Grant & General Funds)**
'ఈ'-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో టెండరు డాక్యుమెంట్ లభ్యమగు ప్రారంభ తేది	: 02-05-2023 సాయంత్రం 04.00 గంటల నుండి
'ఈ'-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో టెండరు డాక్యుమెంట్ లభ్యమగు చివరి తేది	: 17-05-2023 సాయంత్రం 04.00 గంటల వరకు
టెండర్లు సమర్పించుటకు చివరి తేది మరియు సమయం	: 17-05-2023 సాయంత్రం 04.30 గంటల వరకు

ఇతర వివరములకు సంప్రదించవలచిన చిరునామ
www.tender.apeprocurement. gov.in
మున్సిపల్ కమీషనర్, కందుకూరు మునిసిపాలిటీ
కందుకూరు - 523105 (ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా)
ఫోన్ నెం: 9849906607, 08598-222009.

CHANGE OF THE NAME

I, **Mounika Gollapudi** D/o **Rameshbabu** (Old Name), Resident of Peddapadu, Peddakondur post, Kaligiri Mandal Pincode-524225, SPSR Nellore District, A.P. Here by declare that I have changed my name as **CHAVA LAKSHMI MOUNIKA,** W/o **CHAVA HAZARATHAIAH** (New Name)

CHANGE OF THE NAME

I, **DARUKUMALLI NARASA REDDY** S/o **Kotireddy Darukumalli,** Residing at H.No.2-68, Kovur Village in Kandukur Mandal, SPSR Nellore dt, AP-523105, and bearing Passport No. **K5522621** (Issued by Government of india 21-12-2012 to 20-12-2022) Have Changed My Name From **DARUKUMALLI NARASA REDDY** (Old Name) **DARUKUMALLI VENKATA NARASA REDDY** (New Name)